క్లుప్తంగా

మౌనస్వామి ఆశ్రమంలో అన్నసంతర్పణ



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న శివస్వాములు, అయ్యప్ప భక్తులు

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని మౌనస్వామి ఆశ్రమంలో కార్తీకమాసం శనిత్రయోదశి సందర్భంగా శనివారం మౌనస్వామి జీవ సమాధికి రుద్రాభిషేకాది ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు బసవరాజస్వామి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం భజంత్రీ అంబయ్య కుటుంబ సభ్యులు, శివదీక్షను స్వీకరించిన భక్తులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ఔటర్ రింగ్ రోడ్డులో మినీ బస్సు బోల్తా



బోల్తాపడిన మినీ బస్సు

శ్రీశైలం: శ్రీశైలం ఔటర్ రింగ్‌రోడ్డులో శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అదుపుతప్పి ఓ మినీ బస్సు (ఏపీ16టీఎస్ఎస్7994) బోల్తా పడింది. టోల్‌గేట్ సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అదృష్టవశాత్తు బస్సులోని ప్రయాణికులంతా శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం వెళ్లడం, బస్సులో డ్రైవర్ తప్పా ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న సీఐ దివాకర్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మణరావు, దేవస్థానం అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

మినుము పంట పరిశీలన



మినుము పైరు పరిశీలిస్తున్న శాస్త్రవేత్త జయలక్ష్మి

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు వి.జయలక్ష్మి, సతీష్ బాబు శనివారం మినుము పంటను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన విద్యపోగు వెంకటేశ్వర్లు అనే రైతు పంట నష్టపోవడంపై అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు పంటను పరిశీలించేందుకు వచ్చామన్నారు. రైతుతో మాట్లాడి పెట్టుబడి వివరాలు, మందుల పిచికారీ, పైరుకు నీరు పారించే విధానంపై ఆరా తీశారు. 3 రోజుల్లో పూర్తి నివేదికలు, పంటపై ఉన్న విషప్రభావం గురించి తెలియజేస్తామన్నారు. అనంతరం ఆర్బీకేను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఏఓ ఫణీశ్వర రెడ్డి, వ్యవసాయశాఖసిబ్బంది ఉన్నారు.

శ్రీశైలానికి పాదయాత్ర

పాములపాడు: కార్తీక మాసం సందర్భంగా శనివారం శ్రీశైలానికి భక్తులు పాదయాత్రగా బయల్దేరారు. పాములపాడు, కంబాలపల్లి గ్రామాల నుంచి ప్రతి ఏటా కార్తీక మాసంలో పౌర్ణమి సందర్భంగా పాదయాత్రగా వెళ్లడం ఆనవాయితీగా మారింది. 42 సంవత్సరాలుగా దీనిని కొనసాగిస్తున్నారు పాములపాడు భజనమండలి సభ్యులు అందరూ గతంలో పాములపాడు నుంచి కాలినడకన వేళ్లేవారు. అయితే ఇప్పుడు చాలా మంది ఆత్మకూరు మండలంలోని బైర్లూటి వరకు వివిధ వాహనాల్లో చేరుకొని అక్కడి నుంచి అడవీ మార్గం గుండా శివనామస్మరణతో పాదయాత్ర కొనసాగిస్తారు. రాత్రికి పెచ్చెర్వు చేరుకొని బస చేస్తారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి కాలినడకను ప్రారంభిస్తారు. ఉదయం భీముని కొలను చేరుకొని స్నానాలాచరించిన పిదప పాలధార, పంచాదార,. సాక్షి గణపతి దర్శనం చేసుకొని శ్రీశైలం చేరుకుంటారు. పౌర్ణమి రోజున శ్రీశైలం మల్లికార్జున, భ్రమరాంబాదేవి వారిని దర్శించుకొని తిరుగుపయనమవుతారు.

మహిళల రక్షణకు దిశ యాప్



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మహిళల రక్షణ కోసం ప్రవేశపెట్టిన దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకొని ఆపద నుంచి బయటపడాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్, ఏపీఎం అంబమ్మ తెలిపారు. శనివారం జూపాడుబంగ్లా వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో లింగవివక్ష వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా వైకేపీ సిబ్బంది, పొదుపు మహిళలు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పురుషులకు సమానంగా అన్నిరంగాల్లో మహిళలు రాణిస్తున్న తరుణంలో వారికి సమానమైన గౌరవం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌డీ సీసీ గాంధీ, సీసీలు ధన్సింగ్ నాయక్, నాగేశ్వరరావు, జయలక్ష్మి, దేపాల్, వీఓఏలు తిమ్మరాజు, జ్యోతి, ఉర్మత్‌బీ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

29న మున్సిపల్ సమావేశం

నందికొట్కూరు: ఈ నెల 29వ తేదీన ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాల్‌టీ అభివృద్ధి, సమస్యలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని చెప్పారు. మున్సిపాలిటి పరిధిలోని ఆయా శాఖల అధికారులు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

జ్వాలాతోరణం.. సర్వపాపహరణం

- నేడు శ్రీశైలంలో కార్తీకపౌర్ణమి వేడుకలు
- దేదీప్యమానంగా జ్వాలాతోరణోత్సవం
- శాస్త్రోక్తంగా పాతాళగంగ వద్ద పుణ్యనదీహారతి

దీపం..జ్ఞానానికి చిహ్నం. ఐశ్వర్యానికి సంకేతం. సంపద ఆనందాలకు ప్రతీక. అటువంటి దీపానికి అత్యంత ప్రాధాన్యత ఉన్న మాసం కార్తీక మాసం. ఈ మాసంలో 30రోజులూ పుణ్యదినాలే. అటువంటి విశిష్టమైన మాసంలో జరిగే ఉత్సవం..'జ్వాలాతోరణోత్సవం'. జ్వాల అంటే మంట. జ్వాలలతో తోరణాన్ని ఏర్పాటు చేసి జరిపే ఉత్సవమే జ్వాలాతోరణోత్సవం. ఈ ఉత్సవాన్ని కార్తీకపౌర్ణమి రోజున శివాలయాల్లో నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగానే ఆదివారం శ్రీశైల మహాక్షేత్రంలో జ్వాలాతోరణోత్సవం నిర్వహించనున్నారు.



శ్రీశైల ఆలయం



జ్వాలాతోరణోత్సవం(ఫైల్)

శ్రీశైలం టెంపుల్: కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం శ్రీశైల ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్ద జ్వాలాతోరణోత్సవం నిర్వహిస్తారు. అధికసంఖ్యలో భక్తులు ఉత్సవాన్ని దర్శించేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నేతితో తడిపిన నూలు ఒత్తులను ఏర్పాటు చేసి వెలిగిస్తారు. ఇది తోరణంగా వెలుగుతుంది. తోరణంలో కాలిన నూలు ఒత్తుల నుండి వచ్చిన భస్మాన్ని భక్తులు నుదుట ధరించడం ఎంతో విశేషంగా భావిస్తారు. దీని వల్ల ఆయుష్షు, ఐశ్వర్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఉత్సవంలో భాగంగా శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా విశేష పూజాధికాలను నిర్వహించి, పల్లకీలో కొలువుంచి జ్వాలాతోరణం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేయిస్తారు.

శివపార్వతులతో ముడిపడిన పురాణగాథ

పూర్వం కృతయుగంలో అమృతం కోసం దేవదానవులు కలసి క్షీరసాగరాన్ని మథించారట. అందుకు భూమధ్యలో ఉన్న మంధర పర్వతాన్ని కవ్వంగా, కవ్వానికి వాసుకీ సర్పాన్ని తాడుగా చేసుకుని సముద్రంలోకి దించగానే పర్వతం పట్టు తప్పి పడిపోయిందట. దీనితో పర్వతాన్ని పైకి లేపేందుకు శ్రీమహావిష్ణువు కూర్మావతారంలో సాగరంలోకి వెళ్లి తన వీపుతో పర్వతాన్ని ఎత్తగా.. దేవతలు రాక్షసులు కలిసి క్షీరసాగరాన్ని మథించడం ప్రారంభించారు. అందులోనుంచి మొదట హాలాహలం జనించిందట.. సకల లోకాలనూ దహించివేయగల కాలకూట విషమైన దానిని పరమశివుడు లోకహితం కోసం సేవించాడని గాథ. దానిని కంఠంలో ఉంచుకోవడంతో శివుడికంఠం నీలంగా మారింది. దీనిని చూసి భయాందోళనకు గురైన పార్వతీదేవి నాభర్తకు ఏ కీడు తగలకుండా ఈ ఆపద నుంచి బయటపడితే.. భర్తతో పాటు చిచ్చుల తోరణం కింద మూడుసార్లు నడిచి వస్తాను అని అనుకుందట. తర్వాత శివుడుకి ఎటువంటి ఆపద కలగకపోవడంతో పార్వతీదేవి శివుడితో కలిసి కార్తీకపౌర్ణమినాడు జ్వాలాతోరణం కింద మూడుసార్లు నడిచినట్లు అప్పటి నుంచి జ్వాలాతోరణోత్సవం ప్రారంభమైనట్లు పురాణ గాథ.

పుణ్యనదీహారతి

కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని పాతాళగంగ వద్ద ఉన్న కృష్ణవేణమ్మతల్లి విగ్రహానికి సాయంత్రం పుణ్యనదీహారతి కార్యక్రమం నిర్వహిస్తారు. పాతాళగంగ స్నానఘాట్ల వద్ద కృష్ణవేణి నదీమతల్లికి విశేషపూజలు, సారే సమర్పణ, నీరాజనం కార్యక్రమాలతో పాటు పుణ్యనదికి నవహారతులు ఇవ్వనున్నారు.

ఉచిత కుట్టు మిషన్ కేంద్రాల ఏర్పాటు

ఆత్మకూరు: ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 22వ తేదీ నుంచి జిల్లాలోని వివిధ నియోజకవర్గం కేంద్రాల్లో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ మున్నా తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు, నందికొట్కూరు, నంద్యాలలో శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. ఈ కేంద్రాల్లో మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ సమయంలో తమ సంస్థ తరపున కొంత స్టైఫండ్ రూపంలో నగదు అందిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు అబ్దుల్ కలాం, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం



నగదు అందజేస్తున్న వార్డు సెక్రటరీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: వైఎస్సార్ బీమా పేదలకు వరమని వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ పఠాన్ రాజ్‌దార్‌ఖాన్ అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో నివాసముంటున్న సోమిశెట్టి వీరప్ప, శివానందమ్మ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన తక్షణ సాయం రూ.10 వేలను శనివారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శాలిబాషా తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి



జెడ్పీహైస్కూల్‌లో అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నందికొట్కూరు: జ్యాంగాన్ని గౌరవించినప్పుడే మన దేశాన్ని గౌరవించగలమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ తాజుద్దీన్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, పాఠశాలల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు రఘుపతిరెడ్డి, చిట్టెమ్మ, భాస్కర్, అన్వర్ హుసేన్, ఖాజా హుసేన్, అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో

జెడ్పీహైస్కూల్(కోటా)లో హెచ్‌ఎం సలీంబాషా ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో రాజ్యాంగ ప్రవేశిక పఠనం చేయించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాథ్, సాలమ్మ, అరుణా, విజయభారతి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై ఉల్లి విత్తన గొర్రు



రాయితీపై అందజేసిన ఉల్లి విత్తనం గొర్రు

జూపాడుబంగ్లా: ఉద్యానవనశాఖ వారు ఉల్లి విత్తనం గొర్రును రాయితీపై అందజేస్తున్నట్లు పారుమంచాల ఆర్బీకే వీహెచ్ఏ మున్న తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గొర్రు పూర్తి ధర రూ.27వేలు కాగా రాయితీ రూ.10వేలు వస్తుందన్నారు. రైతు మొదట పూర్తి ధర రూ.27వేలు చెల్లించి విత్తనం గొర్రును బుక్ చేసుకోవాలన్నారు. 15రోజుల్లోగా గొర్రు రైతుకు అందజేయనున్నట్లు తెలిపారు. రాయితీ మొత్తం రూ.10వేలు మూడు మాసాల అనంతరం రైతు బ్యాంకు ఖాతాకు జమఅవుతుందని చెప్పారు.

అట్టహాసంగా విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వెలుగోడు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘ సంస్కర్తలు జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే, మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్‌ల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం శనివారం అట్టహాసంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, విగ్రహాల దాత నక్కలమిట్ట శ్రీనివాసులు విగ్రహాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల ఉన్నతి కోసం కృషి చేసిన జాతీయోద్యమ నేతల విగ్రహాలను స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో చరిత్రకారుడు సయ్యద్ నజీర్ అహ్మద్, రచయిత ఇనయతుల్లా, పట్నం రాజేశ్వరి, సిరివెళ్ల రజాక్, ఖలీలుల్లా, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, జెడ్పీటీసీ అమీరూన్‌బీ, హెచ్‌ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న

పగిడ్యాల: క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, హైస్కూల్ హెచ్‌ఎం మధుసూదన్‌రావు అన్నారు. శనివారం స్థానిక స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ క్రీడాకారులకు హైమావతి స్పోర్ట్స్ దుకాణదారుడు శ్రీనివాసులు విరాళంగా ఇచ్చిన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రషీద్‌మియ్య, రమణారావు, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి, కోచ్ శివ, శరత్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి పాస్టర్స్ ఇవాంజలిస్ట్ అండ్ చర్చ్ ఎల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవ. కె. హనోక్ దేవసుజయ్, రెవ.జె.జాన్ బాబు, పాస్టర్ బి.దేవసహాయం, కె.స్వామిదాసు, కె.దానియేలు, ప్రభుదాసు, కె.బక్కన్న, పి.దేవపాల్, పి.రవిప్రకాష్, బాలస్వామి తదితరులు వాక్యోపదేశం చేశారు.

రోవర్ సర్వే పూర్తి

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో రోవర్‌సర్వే పూర్తి అయిందని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న తెలిపారు. శనివారం కొత్తపల్లి, శివపురం గ్రామాలలో రోవర్ సర్వే నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు భవిష్యత్తులో ఎటువంటి భూ సమస్యలు తలెత్తకుండా భూ రీసర్వే నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగానే కొత్తపల్లిలో 5,733 ఎకరాలలో, శివపురంలో 2,707 ఎకరాలలో రోవర్ ద్వారా సర్వే పూర్తిచేయించామన్నారు.

సమ్మేటివ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

పగిడ్యాల: ఈనెల 28 నుంచి ప్రారంభమయ్యే సమ్మేటివ్-1(ఎస్ఏ 1) పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ సుభాన్ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక విద్యాధికారి కార్యాలయంలో మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్నా విప్లవాత్మక మార్పుల నేపథ్యంలో విద్యార్థులు సమ్మేటివ్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా అధ్యాపకులు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు.

శాస్త్రోక్తంగా చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో శనివారం చండీయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితులు శ్రీ దత్తాశ్రమ వ్యవస్థాపకులు మల్లికార్జున రావు ఆధ్వర్యంలో పురోహితులు బాలకృష్ణ శర్మ యాగాన్ని (700 మంత్రాలతో కూడిన) చండీ సప్తశతి పారాయణ చేసి నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆదివారం గ్రామంలో వీరభద్ర స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు రుద్రకోడూరులో లక్షదీపోత్సవం

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలోని రుద్రకోడూరు క్షేత్రంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా సోమవారం లక్షదీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు నల్లగుంట్ల నారాయణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేకువజామున స్వామివారికి పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన ప్రత్యేక అలంకరణతో పాటు విశేషపూజలు నిర్వహిస్తామని చెప్పారు. కార్తీక పౌర్ణమి మహోత్సవం రోజు క్షేత్ర సన్నిధిలో జ్యోతి దర్శనం ఉంటుందని తెలిపారు. భక్తులు ఆటోలు, బైకులపై, ట్రాక్టర్లలో క్షేత్రానికి చేరుకోవచ్చన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన చార్జీలు పెంచాలి

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ చార్జీలు పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.స్వాములు, ఏపీ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల నాయకురాలు నాగేశ్వరమ్మ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈఓలు శ్రీరాములు, ఇనాయతుల్లాలకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో మధ్యాహ్న భోజన పథకంలో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన సంఘం కార్మికులు లక్ష్మీదేవి, రత్నమ్మ, రమాదేవి, మంగమ్మ, జయమ్మ, ఆనందమ్మ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఆత్మకూరు: పట్టణంలో నిలిచిపోయిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఈ నెల 28 నుంచి పునః ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో సామాజిక సాధికార బస్సు యాత్ర ఉన్నందువల్ల వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. తిరిగి ఈ కార్యక్రమాన్ని ఈ నెల 28 నుంచి డిసెంబర్ 1 వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 28న ఎస్పీజీ పాలెం సచివాలయం-2, 29న లక్ష్మీనగర్- 2 సచివాలయం , 30న గరీబ్‌నగర్, డిసెంబర్ 1న రహమత్‌నగర్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

అడిగిన వారందరికీ పనులు కల్పించాలి

పగిడ్యాల: పని కోసం దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఈసీ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పగిడ్యాల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినందున కోరిన ప్రతి కుటుంబానికి పనులు కల్పించేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పనులు చూపాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో గ్రామసభలు ఏర్పాటు చేసి దండోరా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దిలేటి, ఈసీ అశోక్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మహానందిలో వీకెండ్ సందడి





నందీశ్వరుడికి అభిషేక పూజలు చేస్తున్న పండితులు, స్వామివారి సన్నిధిలో బబిత, కుటుంబ సభ్యులు

మహానంది: కార్తీకమాసం, వీకెండ్ సందర్భంగా మహానంది క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయ ప్రాంగణాల్లో కార్తీకదీపాలు వెలిగించారు. అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం

మహానందిలో కొలువైన శ్రీ నందీశ్వరస్వామికి శనివారం ప్రదోష కాలంలో అభిషేక పూజలు వైభవంగా జరిగాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతశర్మ, రుత్వికుల బృందం కార్తీక శుద్ధ త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజల అనంతరం వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో నందీశ్వరాభిషేకం, ప్రదోష కాలార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ వై.మధు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సేవలో..

మహానందీశ్వరస్వామి సన్నిధిలో ఏపీ హైకోర్టు స్టేట్ ఇన్‌చార్జ్ మెంబర్ సెక్రటరీ బబిత, కుటుంబ సభ్యులు శనివారం రాత్రి పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదపండితులు వేదాశీర్వచనం చేయించారు.

మల్లన్న సన్నిధిలో..



ఎస్‌హెచ్ బిశ్వదీప్‌కు ఆహ్వానం పలుకుతున్న ఆలయాధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను అటామిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ జాయింట్ సెక్రటరీ ఎస్‌హెచ్ బిశ్వదీప్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరుస్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండలం అర్చక వేదపండితులు వారికి ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

వేగంగా ఇసుకవాగు వంతెన పనులు



ఇసుకవాగుపై వేగవంతంగా కొనసాగుతున్న వంతెన నిర్మాణం పనులు

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామ సమీపంలోని ఇసుకవాగుపై వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. 60 ఏళ్ల నుంచి ఇసుకవాగుపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు ఎన్నిమార్లు ప్రభుత్వాలకు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో వర్షాకాలం వస్తే చాలు ఉధృతంగా ప్రవహించే ఇసుకవాగు ధాటికి పారుమంచాల గ్రామంతోపాటు తూడిచెర్ల, వాడాల, రేగడగూడూరు తదితర గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయేవి. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఇసుకవాగు వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సత్వరమే స్పందించారు. ఎండీఆర్ ప్లాన్ కింద ఇసుకవాగుపై వంతెన నిర్మించేందుకు రూ.5కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరు కావడంతో ఈ ఏడాది ఆగస్టు 8న వంతెన నిర్మాణానికి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి భూమి పూజచేశారు. ప్రస్తుతం వంతెన నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు ఇలాగే పనులను వేగవంతంగా కొనసాగిస్తే మరో మూడు మాసాల్లో వంతెన నిర్మాణం పూర్తయ్యే అవకాశాలున్నాయి.

చెంచుల సాధికారతే లక్ష్యం

నంద్యాల(అర్బన్): చెంచుల సాధికారతే లక్ష్యంగా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు స్మార్ట్ ట్రైబల్ ఫార్మింగ్ క్లస్టర్ యూనివర్సిటీ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నీరజ తెలిపారు. నేషనల్ వైడ్ ప్రాజెక్టు కింద క్లస్టర్ యూనివర్సిటీ, వీఆర్‌ఓ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చేపట్టబోతున్న చెంచుల అభివృద్ధికి తోడ్పాటునివ్వాలంటూ శనివారం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను ఆమె కలిశారు. అనంతరం మహానంది మండలం చెంచుల లక్ష్మి గూడెంలో చెంచుల జీవన స్థితి గతులను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ చెంచుల పురోగతిపై తయారు చేసిన నివేదికలను కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ, స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరసింహారెడ్డి, ప్రొఫెసర్ సాయిగోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నందికొట్కూరు: విద్యా జ్ఞాపకాలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సాయిరాం జూనియర్, డిగ్రీ కళాశాలల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శనివారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గురువులను ఘనంగా సన్మానించారు. పలువురు విద్యార్థి దశ జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం పలువురు ప్రముఖులను, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డిని సన్మానించారు.